# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **విజయవాడ –హైదరాబాద్‌ల మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే నిర్మించనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి వెల్లడించారు.**
3. **రైతును రాజును చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
4. **ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే ఉద్దేశ్యంతోనే తెలంగాణలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.**
5. **తెలంగాణలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.**

==========================

రైతుల సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో నిన్న 20వ విడత పిఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేసి, 9 కోట్ల 70 లక్షల మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు 20 వేల 500 కోట్ల రూపాయలను నేరుగా బదిలీ చేశారు. అనంతరం ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ.. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా ఇప్పటి వరకూ 3 లక్షల 75 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలకు బదిలీ చేసినట్లు చెప్పారు. అనంతరం దేశ ఆర్థికాభివృద్ధిని వివరిస్తూ...

..వాయిస్.. 31 సెకన్లు

--------------------------

విజయవాడ –హైదరాబాద్ ల మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే నిర్మించనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని, గుంటూరు జిల్లా మంగళగిరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కలిసి నిన్న వివిధ జాతీయ రహదారులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ... ఏ దేశమైన ఆర్థిక ప్రగతి సాధించాలంటే రహదారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. దేశంలో రవాణా వ్యయం 16 శాతం ఉందని దీనిని 9 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ దే భవిష్యత్తు అని పేర్కొంటూ...

..వాయిస్...31 సెకన్లు

అభివృద్ధికి, నాగరికతకు రహదారులు చిహ్నమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 5వేల 233 కోట్ల రూపాయల విలువైన రహదారుల పనులకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి శంఖుస్థాపన చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో 20 పోర్టులు, 9 విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్ గా మారుస్తామన్నారు.

---------------------------

ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే ఉద్దేశ్యంతోనే తెలంగాణలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చినట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని హెచ్ఐసీసీలో నిన్న జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలో బలమైన శక్తిగా ఎదిగిన దేశం, క్రీడలకు బలమైన వేదిక కావాలని పేర్కొంటూ..

వాయిస్ ...30 సెకన్లు

---------------------------

రైతును రాజును చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో నిన్న అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా అర్హులైన రైతుల ఖాతాల్లో తొలి విడతగా ఒక్కొక్కరికీ 7వేల రూపాయల చొపున 46 లక్షల 85 వేల మంది బ్యాంక్ ఖాతాల్లో 2 వేల 343 కోట్ల రూపాయలను బదిలీ చేశారు. వచ్చే సీజన్ కు వెలిగొండ ఫేజ్ 1ను పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలు అందిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తామన్నారు.

---------------------------

తెలంగాణలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాదులోని సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు జిల్లాల్లో 9 సమీకృత సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మించనున్నట్టు చెప్పారు. త్వరలో గచ్చిబౌలిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రైతుల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పిఎం కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎరువులను రైతులకు సబ్సిడీపై అందించేందుకు కేంద్రం 11 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేస్తుందన్నారు.

అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

---------------------------

గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 7 నూతనపై వంతెనలను నిర్మించటం ద్వారా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుజిల్లాలో సంబంధిత అధికారులతో నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ .. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రెండేళ్లలో గుంటూరును ట్రాఫిక్ ఇబ్బందులు లేని నగరంగా మలచాలన్నదే తమ లక్ష్యం అని తెలిపారు.

---------------------------

నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ నిధులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రజలు, ప్రైవేటు భాగస్వామ్యం వంటి నూతన విధానాలను అన్వేషించాలని ఆంధ్రప్రదేశ్ పట్టణభివృద్ధి శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థల కమిషనర్లతో నిన్న దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ స్థానిక సంస్థలలో ఆర్థిక క్రమశిక్షణ అమలుకు సమగ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పన్ను వసూళ్లతో రాబడిని పెంచాలని ఆదేశించారు.

---------------------------

భారత్, ఇంగ్లాడ్ జట్ల మధ్య లండన్ లోని ఓవల్ లో జరుగుతున్న క్రికెట్ 5వ టెస్ట్ మ్యాచ్ లో 3వ రోజు రెండవ ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు చేసి ఆల్అవుట్ అయ్యింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ కు 372 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. రెండవ ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఇంగ్లాండ్ ఆట ముగిసే సమయానికి 50 పరుగులు చేసి ఒక వికెట్ ను కోల్పోయింది. 4వ రోజు ఆట ఈ రోజు కొనసాగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్…15 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================